విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి నెం. 5
శనివారం 9, ఆగస్టు 2025



పెందుర్తిలో విజిబుల్ పోలీసింగ్

విశాలాంధ్ర- పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి.సతీష్ కుమార్ మార్గదర్శకత్వంలో ఎస్ఐ భాస్కర రావు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. పెందుర్తి జంక్షన్ వద్ద ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు శక్తి యాప్ వినియోగ విధానం, మత్తు పదార్థాల వల్ల కలిగే వినాశకర ఫలితాలు, సైబర్ నేరాల ముప్పులు, వాటి నివారణ పద్ధతులపై సమగ్ర సమాచారం అందించారు. అలాగే, స్వీయ రక్షణకు పాటించవలసిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. సమావేశంలో పాల్గొన్న ప్రజలు, తమ సందేహాలను నేరుగా ఎస్ఐతో పంచుకుని, సమాధానాలు అడిగి తెలుసుకున్నారు.

పెందుర్తి పోలీసులు ప్రజా భద్రత, నేరాల నివారణ, అవగాహన పెంపు లక్ష్యాలతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించనున్నట్లు తెలిపారు.

నకిలీ ఆర్ఎంపీ వైద్యుల మాఫియా

వచ్చీరాని వైద్యం
ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైనం

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలో నకిలీ ఆర్ఎంపీ వైద్యుల మాఫియా చెలరేగిపోతోంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన భద్రయ్యపేట కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఘటనలతో వరుసగా వైద్య పరీక్షలు చేసిన తర్వాత ఆ గ్రామ వాసులకి చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు స్థానికంగా అందుబాటులో ఉండే వైద్యులను ఆశ్రయిస్తుండడంతో ఆ వైద్యులు పెయిన్ కిల్లర్స్, యాంటీ బయోటిక్స్ అధిక మోతాదులు ఇవ్వడం వల్ల వారికి తాత్కాలికంగా ఉపశమనం పొందినప్పటికీ కూడా ప్రస్తుతం వారందరూ కిడ్నీ వ్యాధిగ్రస్తులుగా మారారని జిల్లా బృందం తెలియజేసింది. పద్మనాభం మండలంలో ఎటువంటి ఆధారం, గుర్తింపు పత్రం, అనుభవం లేకుండా, వివిధ ప్రాంతాల్లో వివిధ పనులు చేసుకున్న వారు కూడా కొంతమంది ఆర్ఎంపీ వైద్యులుగా చలామణి అవుతున్నారు. వీరిని ఏ గ్రామీణ వైద్యుల సంఘం గుర్తించనప్పటికీ ఎటువంటి వైద్య ఆరోగ్య సంబంధిత అనుభవం లేకపోయినప్పటికీ ప్రతిరోజు గ్రామాల్లో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ ఇళ్ల వద్దకు వెళ్లి రోగుల వివరాలు తెలుసుకుని వారికి చేయవలసిన దానికంటే ఎక్కువ మోతాదుల్లో ఇంజక్షన్లు చేయడం వల్ల చిన్న రోగాలకి కూడా భయంకరమైన వైద్యాలు చేస్తూ అమాయక ప్రజల దగ్గర డబ్బు గుంజుకుంటున్నారు. ముసలివారు, పేదవారు దూర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు వెళ్లలేక ఇంటి వద్దకే వచ్చిన వైద్యులతో వైద్యం చేయించుకోవడం వల్ల వారు మరింత ప్రమాదంలో పడుతున్నారు. వచ్చి రాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. భద్రయ్యపేట కిడ్నీ వ్యాధిగ్రస్తులకు కారణమైన కలుషితమైన నీరు ఒకటైతే, అంతకంటే ప్రమాదమైనది ఈ వచ్చీ రాని నకిలీ ఆర్ఎంపి వైద్యులు మరో కారణం. చిన్న చిన్న రోగాలకు, కీళ్ల నొప్పులకు, ఒళ్ళు నొప్పులకు, గ్యాస్ట్రిక్ వంటి సమస్యలకు తప్పుడు వైద్యం మరో కారణమని ఈ కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరామర్శించడానికి వచ్చిన జిల్లా వైద్యుల బృందం చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆర్ఎంపీలు కొంతమంది మంచి వైద్యం అందించుతున్నప్పటికీ మరికొంతం మంది నకిలి ఆర్ఎంపీలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు కళ్ళు తెరిచి నకిలీ ఆర్ఎంపీలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానిక గ్రామస్తులు వేడుకుంటున్నారు.

పేలుడు బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం

జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నంలో ఫిషింగ్ హార్బర్ సమీపంలోని వెల్డింగ్ షాపులో గ్యాస్ సిలిండర్ పేలి మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందుతోందని, వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

ఇంటింటి కొళాయి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పద్మనాభం: జడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు రెడ్డిపల్లి పంచాయతీలో రెల్లి కాలనీలో చాలా ఏళ్ల నుండి మంచినీటికి ఇబ్బంది పడుతున్న కాలనీవాసుల మంచినీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు సుమారు 5,00,000 జడ్పీ నిధులతో పనులు ప్రారంభానికి శంకుస్థాపన చేయడం జరిగింది. స్థానిక ఎంపీపీ రాంబాబు చేతుల మీదుగా ఈ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్మన్ ఎంపీపీ మాట్లాడుతూ రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో రెల్లి కాలనీలో ఇంటింటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం పూర్తయినట్లయితే ఈ కాలనీలో ప్రతి ఇంటికి మంచినీరు సౌకర్యం శాశ్వతంగా ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరుగుడి అదిబాబు, ఈర్లే ఈశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న రెల్లి కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేసారు.

దేశభక్తిని చాటేలా “హర్ ఘర్ తిరంగా” యాత్ర: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భారత స్వాతంత్ర్యానికి 79 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర పర్యాటక సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య స్ఫూర్తిని కాపాడుతూ దేశభక్తిని చాటిచెప్పేలా “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమాలను ఆగస్టు 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా లోనూ జాతీయ పతాకం ప్రాముఖ్య తను, స్వాతంత్ర్య పోరాటంలో, దేశ ప్రజలను సమైక్యంగా ఒక్క తాటిపై నిలిపి ఉంచడంలో జాతీయ జెండా భూమికను తెలిపే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. జాతీయ పతాకాన్ని ఎగరేయడం ద్వారా దేశభక్తిని వ్యక్తం చేయడం, జాతీయ పతాకంపై వ్యక్తిగత అనుబంధాన్ని మరింతగా పెంపొందిం చడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఆగస్టు 8 నుంచి 13 వరకు ‘తిరంగా యాత్ర’, ‘తిరంగా సెల్ఫీలు’, ‘తిరంగా ట్రిబ్యూట్’, ‘తిరంగా మేళా’ వంటి కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఆగస్టు 12న ఉదయం 7 గంటలకు నగరంలోని బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు భారీ ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. ఈ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. థింసా, కోలాటం వంటి కళా రూపాల ప్రదర్శనతో తిరంగా యాత్ర జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు దేశ భక్తి గేయాలు, చిత్రలేఖనం, తిరంగా రంగోలి, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

టీడీపీకి కష్ట కాలంలో అండగా తెలుగు శక్తి

విశాలాంధ్ర- విశాఖపట్నం: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు అనుచరుడు రౌతు శ్రీనివాస రావు ఓటమి తెలుగు దేశం పార్టీకి తీవ్ర అవమానమని, ఒక స్థానం ఓడిపోవడం, అది పూర్తిగా టీడీపీ గాజువాక కార్పొరేటర్లు క్రాస్ ఓటింగ్ వల్లే ఓటమి పాలైనట్లు స్పష్టమవుతుందని తెలుగుశక్తి అధ్యక్షులు బివి రామ్ అన్నారు. శుక్రవారం ఉదయం మహాత్మా గాంధీ విగ్రహం, జీవీఎంసీ దగ్గర ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్లా మీద పూర్తి వ్యతిరేకతతోనే అతని అనుచరుడ్ని ఓడించారని, ఈ ఓటమికి బాధ్యత వహిస్తూ తక్షణమే పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పల్లా వల్ల పార్టీకి నష్టమే గాని ఏ ప్రయోజనం లేదని, అతని మీద ఈ వ్యతిరేకత ఒక గాజువాకలోనే కాదని రాష్ట్రం అంతా ఉందన్నారు. దీనివల్ల పార్టీ భ్రష్టు పట్టిపోయే అవకాశం ఉందని, కాబట్టి ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వెంటనే మేల్కొని, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని కోరారు. కష్ట కాలంలో తెలుగుదేశం పార్టీకి తెలుగు శక్తి, తాను అండగా ఉన్న విషయం గుర్తు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గండిగుండం జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం 6 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే గండిగుండం గ్రామానికి చెందిన మధుపాడ రాము (66) ఎప్పటిలాగే ఉదయం కూడా పాలు తీసుకొని జాతీయ రహదారిపై రోడ్డు దాటే క్రమంలో పెందుర్తి నుండి ఆనందపురం వస్తున్న వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ప్రస్తుతం కూలి పనులు చేసుకుంటూ అల్లుడు వద్ద ఉంటున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలివేలు మంగమ్మ సేవలో ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు సప్తగిరి నగర్ అలివేలు మంగాదేవిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పవిత్ర వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ అలివేలుమంగా దేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పవిత్ర శ్రావణమాసంలో తెలుగింటి ఆడపడుచులకు సౌభాగ్యాన్ని ఐశ్వర్యాన్ని వరలక్ష్మి దేవి ప్రసాదించాలని, అమ్మవారి కృపా కటాక్షాలు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని సకల సౌభాగ్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆలయ కమిటీ సభ్యులు మురళి రాజు, ముదునూరి రాజా సుధాకర్, రాపర్తి నందు, త్రినాథ్, లక్ష్మీ గోవింద్, చీరా రాజు, గోసాల కేశవ్, గన్రెడ్డి రమేష్, కంచిపాటి బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

24/7 మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ నగరంలో జరుగుతున్న 24/7 మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మంచినీటి సరఫరాను అందించే చర్యలు చేపట్టాలని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు కె.వి.ఎన్.రవిను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆయన జీవీఎంసీ జోన్ - 5 పరిధిలో మాధవధారలో గల విశాఖపట్నం నార్త్ వెస్ట్ సెక్టార్‌లో ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులతో అమలవుతున్న 24/7 మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను నీటి సరఫరా విభాగం ఇంజనీరులతో కలిసి పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ 24/7 మంచినీటి సరఫరా ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న పనులను గుత్తేదారు నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ తక్షణమే పూర్తి చేసేటట్లు చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీర్ కెవిఎన్ రవికు ఆదేశించారు. నిర్ణీత గడువు తేదీ 31-12-2025 నాటికి పూర్తిస్థాయిలో ఆయా పనులను పూర్తి చేయాలని స్పష్టంగా తెలిపారు. ఇప్పటికే ప్రాజెక్టు పరిధిలో పూర్తి చేసిన మాధవధార, మురళీనగర్, మర్రిపాలెం ప్రాంతాలలో 24/7 నీటి సరఫరా ప్రారంభమైందని, ఈ ప్రాంతాల్లో ఇప్పటికే 5 వేలు మంచినీటి సరఫరా కనెక్షన్లు అందించిన వినియోగదారులకు వారు వినియోగిస్తున్న నీటి పరిమాణానికి అనుగుణంగా బిల్లులు సిద్ధం చేయవలసినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్లు ఏడుకొండలు, మురళీకృష్ణ, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు సతీష్, సహాయక ఇంజనీరులు రాజ్ కుమార్, సుమన్, నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రంగారావు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ పేరుతో భూ దోపిడి

భీమన్నదొరపాలెంలో

విశాలాంధ్ర - ఆనందపురం: ల్యాండ్ పూలింగ్ పేరుతో పేద రైతుల సాగు భూములను స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వినియోగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని సీపీఎం నాయకులు, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు ఆరోపించారు. శుక్రవారం ఆయన ఆనందపురం మండలంలోని సొంట్యాం పంచాయతీ మిందివానిపాలెం, కనమాం పంచాయతీ గోరింట, భీమన్నదొరపాలెం, గిడిజాల, తంగుడుబిల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఇలాగే వందల ఎకరాల సాగు భూములను స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిపారని, ఇప్పుడు ప్రభుత్వం అదే బాటలో నడుస్తోందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్ పేరుతో సాగుభూములను నాశనం చేస్తున్నారని తెలిపారు. గిడిజాల రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 258లో 309.18 ఎకరాలు, గోరింటలో సర్వే నంబర్ 108లో 198.31 ఎకరాలు, సొంట్యాంలో సర్వే నంబర్ 347/పి 251.55 ఎకరాలు, భీమన్నదొరపాలెంలో సర్వే నంబర్ 1లో 122.53 ఎకరాలు, పద్మనాభం మండలం కొవ్వాడలో 250.52 ఎకరాలు, అనకాపల్లి జిల్లా సబ్బవరంలో 175.42 ఎకరాలు, ఆమాట జంగాలపాలెంలో 141.01 ఎకరాలు, ఏ.శిరసపల్లిలో 371.75 ఎకరాలు, నాల్లరేగుడిపాలెంలో 27.37 ఎకరాలు, పైడివాడ అగ్రహారంలో 28.14 ఎకరాలు, తగరంపూడిలో 4 ఎకరాలు, విజయనగరం జిల్లా డెంకాడలో 20.41 ఎకరాలు, భోగాపురం మండలం రావాడలో 5 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ కింద ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 4న కొవ్వాడ, సెప్టెంబర్ 6న గిడిజాల, సెప్టెంబర్ 9న గోరింట, సెప్టెంబర్ 11న భీమన్నదొరపాలెంలో గ్రామసభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించనున్నట్లు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసిందని తెలిపారు. అనంతరం అక్టోబర్ 3 నుండి 18 వరకు విచారణ జరిపి భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. రైతుల భూములను అమ్మి విశాఖ మెట్రో రైలుకు నిధులు సమకూర్చాలని ప్రభుత్వం యోచిస్తోందని గంగారావు ఆరోపించారు. పర్యావరణాన్ని పాడుచేసి, పంట తోటలను తొలగించి అభివృద్ధి పేరుతో దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రైతులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఏపీఎల్ సీజన్ -4 ప్రారంభం

ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, హీరో వెంకటేష్
స్వాగతం పలికిన ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ -4 శుక్రవారం సాయంత్రం ఏసీఏ - విడిసిఎ మైదానంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా టాలీవుడ్ నటి ప్రగ్యా జైస్వాల్ నృత్య ప్రదర్శన, ఏపీఎల్ సీజన్ 4 ఎంథమ్ సాంగ్ రూపొందించిన మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ పాకాల సంగీత ప్రదర్శన ప్రేక్షకులకు అలరించాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కేంద్ర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, ఏపీఎల్ సీజన్ బ్రాండ్ అంబాసిడర్ వెంకటేష్‌కి ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ స్వాగతం పలికారు. ఈ ఏపీఎల్ సీజన్ 4 ప్రారంభోత్సవ వేడుకలకి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ ఎం.శ్రీ భరత్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.మాధవ్ హాజరయ్యారు. ఈ ఏపీఎల్ సీజన్ -4 ట్రోఫీని రామ్మోహన్ నాయుడు, వెంకటేష్ ఏడు జట్లు టీమ్ కెప్టెన్స్‌తో ఆవిష్కరించారు. అనంతరం ఏపీఎల్ సీజన్ 4 మొదటి మ్యాచ్ లో తలపడిన కాకినాడ కింగ్స్ వర్సెస్ అమరావతి రాయల్స్ జరిగిన మ్యాచ్‌ను గ్యాలరీలో కూర్చొని వీక్షించారు. అలాగే ఏపీఎల్ సీజన్ ప్రారంభోత్సవ వేడుకలకి హాజరైన విద్యార్థులకు స్నాక్స్, విందు ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ విశాఖపట్నం వేదికగా ఎపిఎల్ సీజన్ -4 ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఏపీఎల్ సీజన్ 4లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ఆంధ్రలోని క్రికెట్ టాలెంట్ గెలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఏపీఎల్ సీజన్ 4 మ్యాచ్ లను భారీ ఎత్తున నిర్వహించబోతున్నామని, ఈ సంవత్సరం మొత్తం ఏడు జట్లు పాల్గొంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్, ఏపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, మాజీ క్రికెటర్ ముండేశ్వరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీపై విష ప్రచారం తగదు

- నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాల మోహన్ దాస్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశ స్వాతంత్ర ఉద్యమంలో గాంధీజీ ప్రముఖ పాత్ర పోషించారని, అటువంటి గాంధీపై విష ప్రచారం చేస్తున్నారని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాల మోహన్ దాస్ అన్నారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో ఓపెక్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో “భావ తరంగం వైజాగ్- 2025” పేరున నిర్వహించిన మేధావుల చర్చా వేదికలో ఆయన పాల్గొని “గాందేయ వాదం.. రాజకీయ ప్రాముఖ్యత” అనే అంశంపై ప్రసంగించారు. మహాత్మా గాంధీజీ భావాలను ప్రతి ఒక్కరూ తప్పకుండా తెలుసుకో వాలని చెప్పారు. గాంధీజీ మీద రెండు పుస్తకాలు రాశానని, 175 కథలు గాంధీపై రాశానని పలు దినపత్రికలలో రెగ్యులర్‌గా ప్రచు రించబడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం వాట్సాప్ యూనివర్సిటీ ముస్లింలకు గాంధీజీ మద్దతు పలికారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. భారత్‌ను నాశనం చేసింది గాంధీ అని తప్పుడు కథనాలను చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆనాటి ప్రపంచ మేధావులు గాంధీని కొనియాడిన విషయాన్ని వారు మర్చిపోయారన్నారు. రక్త మాంసాలు ఉన్న ఇటువంటి మనిషి ఈ భూమి మీద సంచరించారంటే ఆశ్చర్యంగా ఉందని శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కొనియాడిన విషయాన్ని ప్రస్తావించారు. మహాకవి శ్రీశ్రీ గాంధీపై రాసిన కవిత్వాన్ని చదివి వినిపించారు. జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మ రెడ్డి సైన్సు రాజ్యాంగం ఆధారంగా దేశానికి కావలసిన న్యాయం ఐక్యత అంశంపై ఆయన ప్రసంగించారు. శ్రమ చేసిన వారికి ఫలితము అందాలని, శ్రమ చేయని వారికి హక్కు లేదన్నారు. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రజల న్యాయం ఐక్యత కోసం అందరూ కృషి చేయాలన్నారు. జనంలో విజ్ఞానాన్ని కలిగించడానికి జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఓపెక్ (ఓపీఎస్)ఫౌండర్ దండి ప్రియాంక మాట్లాడుతూ జేవీవీతో కలిసి బావ తరంగం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. దామోదరం సంజీ వయ్య యూనివర్సిటీ మాజీ విసి సత్యనారాయణ మాట్లా డుతూ దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు తీవ్రమయ్యాయని, ఇలాంటి చరిత్ర గతంలో ఎప్పుడు లేదన్నారు. డా.అంబేద్కర్ దేశ ప్రజల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం రూపొందిస్తే, ఈరోజు ఆ రాజ్యాంగంపై దాడి జరగడం బాధాకరం అని ఆయన అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ విసి జార్జి విక్టర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బి.సుబ్బయ్య తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కృష్ణాజీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షులు విజయ్, చందర్, కాండవ గాయత్రి, చిన్న బాబు, ఉమ్మిడి భాస్కర్, నారాయణ, మొహమ్మద్ ఆలీ, సూర్య, యువత, సామాజిక వేతలు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డ్ విజేత డా. పి.జె.సుధాకర్‌కు విఎంసిఎస్ నివాళి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దూరదర్శన్ మాజీ న్యూస్ డైరెక్టర్ డా. పి.జె.సుధాకర్ (68) మృతి పట్ల విస్తరణ మాస్ కమ్యూనికేషన్ సొసైటీ (వి ఎంసిఎస్) తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. శుక్రవారం నగరంలో జరిగిన సంతాప సభలో విఎంసిఎస్ అధ్యక్షుడు కె.వి.ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ 121 అకడమిక్ డిగ్రీలు, అనేక గ్రాడ్యుయేషన్ డిగ్రీలు, 16 పీహెచ్.డీలు కలిగి ఉండటం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన డా. సుధాకర్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారన్నారు. విద్యపై ఆయనకు ఉన్న అపారమైన ఆసక్తి, నిరంతర అధ్యయనంపై నిబద్ధత ఆయనను దేశవ్యాప్తంగా ప్రేరణాత్మక వ్యక్తిగా నిలిపిందన్నారు. 2022లో జరిగిన జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకల్లో డా. సుధాకర్‌ను విఎంసిఎస్ సత్కరించిన విషయాన్ని గుర్తుచేసారు. బౌద్ధం, సామాజిక సంస్కరణల పట్ల ఆయనకు ఉన్న లోతైన ఆసక్తిని ప్రతిబింబించేలా మొత్తం 10 పుస్తకాలను రచించారని తెలిపారు. యుపిఎస్సి మాజీ చైర్మన్ ఆచార్య కేయస్.చలం మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి చదువు మీద ఆసక్తితో ఎంతో కష్టపడి ఉన్నత స్థానానికి చేరుకున్నారని, పిజే సుధాకర్ తనకు శిష్యుడు, మంచి మిత్రుడు అని అన్నారు. అతనికి రావలసినంత గుర్తింపు రాలేదని, దానికి కారణం బహుశా ఉత్తరాంధ్ర దళితుడు కావడమేనేమో? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతి నాలో చాలా విషాదాన్ని నింపింది అన్నారు. కూలీ చేసి చదువుకున్నాడని, చిన్ననాటి నుంచి ఒకటే ధ్యాస, చదువు, డిగ్రీలు సాధించటం గుర్తింపు కోసం ఆరాట పడేవారు అన్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా వేదికపై పలు అంశాలపై మాట్లాడేవారన్నారు. వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను అన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: రక్షాబంధన్ సందర్భంగా విశాఖపట్నం మహారాణి పేట బ్రహ్మకుమారీల మెడిటేషన్ సెంటర్ అధినేత బ్రహ్మకుమారి సిస్టర్ శివలీల జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు రాఖీ కట్టి, విశాఖ నగరంలో గల అన్నా చెల్లెళ్ల బంధాలు మరింత ఆదర్శంగా ఉండాలని బ్రహ్మకుమారీలు అందరూ కోరుకుంటున్నామని కమిషనర్‌కు తెలిపారు. పరంజ్యోతి స్వరూపుడు పరమశివుడు మనందరికీ పరమ రక్షకుడు అనే సందేశాన్ని ఇచ్చారు. అనంతరం బ్రహ్మకుమారిల ఆధ్వర్యంలో ఆగస్టు 23వ తేదీన కేజీహెచ్ బ్లడ్ బ్యాంక్ వద్ద 2025 రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియచేయగా సంబంధిత పోస్టర్ ను కమిషనర్ ప్రదర్శించారు .రక్తదాన శిబిర కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని బ్రహ్మకుమారి శివలీల సిస్టర్ కమిషనర్‌ను కోరారు. కమిషనర్ స్పందిస్తూ తప్పకుండా రక్తదాన శిబిరానికి వస్తానని తెలుపుతూ, రక్షాబంధన్ సందర్భంగా బ్రహ్మకుమారీ అక్క చెల్లెల్లు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్రహ్మ కుమారీలు, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో దృష్టి సమస్యలపై అవగాహనతో వ్యవహరించాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: పిల్లల్లో ఉన్న దృష్టి సమస్యల పై జాగ్రత్త వహించాలని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆగస్టు పిల్లల కంటి ఆరోగ్యం భద్రతా అవగాహన మాసం సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ప్రత్యేకమైనవారని, వారి దృష్టి కూడా అంతే ప్రత్యేకమైనదన్నారు. కంటి ఆరోగ్యం మరియు భద్రత సంతృప్తికరమైన బాల్యంలో చాలా ముఖ్యమైన భాగాలని, బాల్యంలో నేర్చుకునే ప్రక్రియలో ఎక్కువ భాగం దృశ్యపరంగా జరుగుతుందన్నారు. పిల్లల శ్రేయస్సు కోసం మంచి దృష్టి చాలా ముఖ్యమైనదని, శారీరకంగా మరియు మేధోపరంగా అని చెప్పారు. తరచుగా కళ్ళు రుద్దడం, కళ్ళు చిట్లించడం, తల వంచడం లేదా వస్తువులను చూడటానికి తల తిప్పడం వంటివి ఆందోళన కలిగించే సాధారణ సంకేతాలు అన్నారు. పిల్లవాడు తన కళ్ళను కూడా పిండవచ్చు లేదా అతని కళ్ళు తిరుగుతున్నట్లు గమనించవచ్చు అని, పిల్లల కంటి ఆరోగ్యం గురించి అవగాహన పెంచడానికి, అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆప్తాల్మాలజీ ఆగస్టును పిల్లల కంటి ఆరోగ్యం, భద్రతా అవగాహన మాసంగా పేర్కొందన్నారు. షార్ట్-సైట్నెస్ (మయోపియా), లేజీ ఐ (అంబ్లియోపియా), క్రాస్డ్ కళ్ళు (స్ట్రాబిస్మస్), కంటి గాయాలు పిల్లలలో కంటి సమస్యలుగా కనిపిస్తాయని చిన్న పిల్లలు తరచుగా తమ దృష్టి సమస్యలను మాటలతో చెప్పరు కాబట్టి, పిల్లల సంరక్షణ మరియు పెంపకంలో పాల్గొన్న తల్లిదండ్రులు మరియు ఇతర పెద్దలు వారి కళ్ళను క్రమం తప్పకుండా అంచనా వేయడం చేసి, అవసరమైతే పిల్లలు క్రమం తప్పకుండా సమగ్ర కంటి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2025లో కీర్తిలాల్స్‌కి ప్రత్యేక అవార్డ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రముఖ వజ్రాభరణాల సంస్థ కీర్తిలాల్స్‌కి రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2025లో ప్రత్యేక అవార్డ్ లభించింది. ఈ మేరకు జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సంవత్సరపు సహజ వజ్ర చెవిపోగులు (నేచురల్ డైమండ్ ఇయర్ రింగ్స్ ఆఫ్ ది ఇయర్) అవార్డును అతిధులైన ప్రమోద్ మెహతా, పులికిట్ మెహతా చేతుల మీదుగా కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యువలరీ రంగంలో ప్రతిష్టాత్మకంగా పేరుగాంచిన రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డులలో 2025లో సహజ డైమండ్ చెవిరింగుల విభాగంలో అవార్డు లభించడం ప్రత్యేక గుర్తింపుగా చెప్పారు. భారతదేశం యొక్క ప్రధాన ఆభరణాల బ్రాండ్స్ గా కీర్తిలాల్స్ కి జరిగిన సత్కారం అన్నారు. ఈ గుర్తింపు ఆభరణాల హస్తకళ, ఆవిష్కరణలలో రాణించడానికి బ్రాండ్ యొక్క నిబద్ధతను హైలైట్ చేస్తుందన్నారు. కీర్తిలాల్స్ అభిరుచి, హస్తకళకు గుర్తింపు పొందడం ఈ అవార్డు తో తమ బృందం యొక్క కృషి దూర దృష్టికి నిదర్శనం అని, తమ కస్టమర్లు ఇష్టపడే విశ్వసించే సున్నితమైన ఆభరణాలను సృష్టించడం కొనసాగించడానికి తాము పునరంకితమవుతామని చెప్పారు. ఈ రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డుల కార్యక్రమంలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన ఆభరణాల పరిశ్రమ నాయకులు, డిజైనర్లు మరియు చేతివృత్తుల వారు పాల్గొన్నారు.

జిల్లా ప్రాతినిధ్యానికి ఎంపికైన ఆనందపురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం: జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలలో విశాఖపట్నం జిల్లాకు ప్రాతినిధ్యం వహించే గౌరవం ఆనందపురం జడ్పిహెచ్ఎస్ విద్యార్థులకు లభించింది. ఉమ్మడి ఎస్ఏపీ సమగ్ర క్రీడా సముదాయంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన ఈ యువ క్రీడాకారులు జిల్లా స్థాయి వేదికపై తమ ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతున్నారు. ఖో-ఖో: బి. హర్ష, హేమంత్, గౌతమ్, 100 మీటర్ల పరుగులు: 1వ స్థానం- చరణ్, 3వ స్థానం- ఎం. శ్రీను, 400 మీటర్ల పరుగులు: 1వ స్థానం - లక్ష్మణ్, 800 మీటర్ల పరుగులు: 3వ స్థానం - గణేష్, లాంగ్ జంప్: కిరణ్, వినయ్ ఎంపికయ్యారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జి తదితరులు క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సిద్ధం చేశారు. "జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే మా ప్రధాన లక్ష్యం" అని వారు పేర్కొన్నారు. గ్రామీణ పాఠశాల విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తెచ్చిన ఈ విజయాలు స్థానిక క్రీడాభిమానుల్లో ఆనందాన్ని నింపాయి. పాఠశాల సిబ్బంది, తల్లి దండ్రులు, గ్రామస్థులు ఈ క్రీడా కారులకు శుభాకాంక్షలు తెలుపుతూ, జిల్లా స్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

షాట్' - సిరంజి, క్యాట్రిడ్జ్ గ్లాస్ ట్యూబింగ్‌ల విడుదల

విశాలాంధ్ర - విశాఖపట్నం: స్పెషాలిటీ గ్లాస్‌లో ప్రపంచంలో అగ్రగామిగా ఉన్న షాట్ (ఎస్సీహెచ్ఓటీ), నేడు గుజరాత్ రాష్ట్రం జంబుసర్‌లో తన ప్రస్తుత అత్యాధునిక తయారీ సామర్థ్యాలకు సిరంజి, క్యాట్రిడ్జ్ ట్యూబింగ్‌ను జోడించామని వెల్లడించింది. ఇది ఇండియన్ గ్లాస్ ప్రాథమిక ఫార్మాస్యూటికల్ ప్యాకేజింగ్ విభాగంలో ఒక కీలక మైలురాయిని సూచిస్తుంది. 'మేక్ ఇన్ ఇండియా' చొరవకు షాట్ నిబద్ధతను బలోపేతం చేస్తుంది. ఈ వ్యూహాత్మక చర్య కంపెనీని ఆసియాలో అతిపెద్ద సిరంజి, క్యాట్రిడ్జ్ గ్లాస్ ట్యూబింగ్ ఉత్పత్తిదారునిగా నిలుపనుంది. ఈ అత్యాధునిక ఉత్పత్తి షాట్ ప్రఖ్యాత జర్మన్ నైపుణ్యం నుంచి ప్రత్యక్ష సాంకేతిక బదిలీగా చెప్పవచ్చు. ఇది టైప్ 2 డయాబెటిస్ ఉన్న రోగులలో బరువు నిర్వహణ, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ కోసం ఉపయోగించే సెమాగ్లుటైడ్ బయోలాజిక్స్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంది. భారతదేశంలో షాట్ ని ఫార్మా అన్ని గ్లాస్ ప్రైమరీ ప్యాకేజింగ్ అవసరాలను పూర్తిగా పరిష్కరించేందుకు అవకాశం కల్పిస్తుంది.

వెయిల్స్, ల్స్ మరియు యాంపిల్స్ గ్లాస్ ట్యూబింగ్ నుంచి కొత్తగా జోడించిన సిరంజిలు, క్యాట్రిడ్జ్‌ల వరకు ఇందులో ఉన్నాయి.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 - 2560414, 2575046 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

నూతన బిఎండబ్ల్యు సిరీస్ గ్రాన్ కూపే విడుదల

విశాలాంధ్ర - విశాఖపట్నం : న్యూ బిఎండబ్ల్యు 2 సిరీస్ గ్రాన్ కూపే నేడు భారతదేశంలో విడుదలైంది. చెన్నైలోని బీ ఎం డబ్ల్యూ గ్రూప్ ప్లాంట్‌లో స్థానికంగా తయారైన రెండవ తరం బిఎండబ్ల్యు 2 సిరీస్ గ్రాన్ కూపే దేశంలో ప్రత్యేకంగా పెట్రోల్ పవర్‌ట్రెయిన్‌లో అందుబాటులో ఉంటుంది. ఈ కారును అన్ని బిఎండబ్ల్యు ఇండియా డీలర్‌షిప్‌లలో బుక్ చేసుకోవచ్చు మరియు డెలివరీలు నేటి నుంచి ప్రారంభమవుతాయి. న్యూ బిఎండబ్ల్యు 2 సిరీస్ గ్రాన్ కూపే దాని ఎక్స్‌ట్రావర్టెడ్ డిజైన్, స్పోర్టీ డ్రైవింగ్ క్యారెక్టర్‌తో తన సొంత ప్రత్యేకతను రూపొందించుకుంది. ప్రీమియం కాంపాక్ట్ విభాగంలో స్టైల్ గ్రాన్ కూపే సిల్హౌట్‌ను కోరుకునే నగరంలోని యువ వినియోగ దారులకు ఇది అత్యంత వేగంగా ఫేవరెట్‌గా మారిందని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా డైరెక్టర్ విక్రమ్ పావాహ అన్నారు.

వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల వ్యాప్తంగా గ్రామాలు భక్తి, శ్రద్ధలతో కళకళలాడాయి. వరలక్ష్మి వ్రతం సందర్భంగా తెల్లవారుజాము నుంచే మహిళలు పూజా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇళ్లు, వీధులను పూలమాలతో, మామిడి తోరణాలతో అలంకరించారు. కళశ స్థాపన చేసి, పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ మంత్రోచ్చారణలతో హారతులు అర్పించగా, వాతావరణం భక్తిరసభరితంగా మారింది. సాంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, యువతులు పూజలో పాల్గొన్నారు. పసుపు, ఆకులు, బొగ్గులు, కంచం వంటి పూజా సామగ్రిని సమకూర్చుకుంటూ బంధుమిత్రులు పరస్పరం కలుసుకున్నారు. పలుచోట్ల సామూహిక వరలక్ష్మి వ్రతాలు కూడా నిర్వహించారు. పూజ అనంతరం నైవేద్యం సమర్పించి, ప్రసాదాన్ని అందరికీ పంపిణీ చేశారు. వరలక్ష్మి వ్రతం ఆచరించడం వల్ల కుటుంబ సమృద్ధి, ఐశ్వర్యం కలుగుతుందని పెద్దలు, పండితులు తెలిపారు. పండుగను పురస్కరించుకొని కొన్ని గ్రామాల్లో సాంప్రదాయ ఆటలు, హారతి పాటలు కూడా నిర్వహించారు. గ్రామాల్లో రోజు మొత్తం పండుగ వాతావరణం నెలకొంది.